క్లుప్తంగా

60 మందికి వైఎస్సార్ కంటివెలుగు పరీక్షలు



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం డాక్టర్ వైఎస్సార్ కంటివెలుగు పరీక్షలు నిర్వహించారు. కంటివైద్య నిపుణులు రోజారాణి మాట్లాడుతూ అవ్వ,తాతలు 60 మందికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వారిలో 40 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించామన్నారు. పదిమందికి కంటిచుక్కలు మందు వేసి, మందులు అందజేసినట్లు తెలిపారు. మిగిలిన పదిమందిని గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలకు కంటి శుక్లాల ఆపరేషన్లు చేయించుకునేందుకు రిఫర్ చేసినట్లు తెలిపారు. డాక్టర్ యానిగ్రేస్, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో అన్నదానం



మంగళగిరి: నగరంలోని బాపనయ్యనగర్‌లో నూతనంగా నిర్మించిన కోదండ రామస్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఐదవ రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కోలా శ్రీనివాసరావు, గాజుల క్రాంతి కుమార్, కిషోర్, ఆంజనేయులు, భక్త బృందం ప్రతినిధులు పాల్గొన్నారు.

వీర్లపాలెంలో ప్రత్యేక ప్రార్థనలు



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని వీర్లపాలెం గ్రామంలో శ్రీ యేసు నామ క్షేత్రం నందు సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వాహకుడు రావిపాటి ఈనాక్ శిరీష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సికింద్రాబాద్, కింగ్‌డమ్ కమ్యూనిటీ చర్చి పాస్టర్ జి.కమల్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వమానవాళి సుఖశాంతులతో ఆనందంగా జీవించాలని, ఏసుక్రీస్తు అందరికీ రక్షణ కల్పిస్తాడని అన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దుగ్గిరాల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పున్న సురేష్‌బాబు, జనరల్ సెక్రటరీ జుజ్జువరపు విజయరావు, సంఘ పెద్దలు అచ్యుతరామయ్య, రమాదేవి పాల్గొన్నారు.

గణేశుడి విగ్రహం ధ్వంసం



ఫిరంగిపురం: ప్రసిద్ధి చెందిన గణేశుడి విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసిన సంఘటన మండలంలోని గణేశునిపాడు గ్రామ శివారు చెరువుకట్ట వద్ద సోమవారం తెల్లవారుజామున చేటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామశివారులోని చెరువుకట్ట మీద నున్న గణేశుడి విగ్రహాన్ని గుర్తుతెలియని దుండుగులు ధ్వంసంచేశారు. విగ్రహం వద్ద నిధులు ఉంటాయనే దురుద్దేశంతో ఇటువంటి పనిచేసి ఉండవచ్చని పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అత్తపై అల్లుడి దాడి

తెనాలిరూరల్: అత్తపై అల్లుడు దాడి చేసిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని ఐతానగర్ లంకదిబ్బ ప్రాంతానికి చెందిన రవి తన భార్యతో ఘర్షణ పడుతుండడంతో అతని అత్త నాగమ్మ వెళ్లింది. అదేంటని ప్రశ్నించిన ఆమెపై అతను దాడి చేయగా మెడపై గాయమైంది. నాగమ్మ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ పోలీసులు సోమవారం తెలిపారు.

న్యూట్రిషియన్ ఫుడ్స్‌తో చక్కని ఆరోగ్యం

గుంటూరు వెస్ట్: న్యూట్రిషియన్ ఫుడ్స్‌తో చక్కని ఆరోగ్యాన్ని పొందవచ్చని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. బ్రాడీపేటలోని జాయ్ అండ్ షైన్ వెల్‌నెస్ కేంద్రాన్ని ఆయన సోమవారం 32వ డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి ఆచారితో కలసి సందర్శించారు.ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ హోదా, డబ్బున్నా ఆరోగ్యం లేకపోతే ఇబ్బందులు తప్పవన్నారు. నేడు చక్కని మైక్రో న్యూట్రిషియన్ ఫుడ్స్ అందుబాటులో ఉన్నాయని, నిపుణుల సాయంతో వాడుకోవాలని సూచించారు. జాయ్ అండ్ షైన్ వెల్‌నెస్ చీఫ్ కోచ్ జె.జ్యోతి శ్యామ్ మాట్లాడుతూ హెర్బాలైఫ్ ప్రొడక్ట్స్‌తో పాటు ఆధునిక వ్యాయామాలు కూడా చేయిస్తున్నామని చెప్పారు. అనంతరం అప్పిరెడ్డిని ఘనంగా సత్కరించారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం

- ఎంటీఎంసీ పరిధిలో 11 పరీక్ష కేంద్రాలు
- హాజరైన 2,309 మంది విద్యార్థులు
- 15 మంది గైర్హాజరు



యర్రబాలెం డాన్‌బాస్కో ఉన్నత పాఠశాల వద్ద ఉదయం 8గంటలకే చేరుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



దుగ్గిరాలలో విద్యార్థులను చెక్ చేసి లోపలికి పంపిస్తున్న సిబ్బంది

మంగళగిరి: నగర పరిధిలో పదో తరగతి పరీక్షలు తొలి రోజు ప్రశాంతంగా జరిగాయి. సోమవారం ఉదయం 9:30 గంటలకు ఫస్ట్ లాంగ్వేజ్ తెలుగు పరీక్ష ప్రారంభమైంది. తొలిరోజు కావడంతో విద్యార్థులను గంట ముందే పరీక్ష కేంద్రాలకు అనుమతించారు. నగర పరిధిలోని మొత్తం 11 సెంటర్లలో 2,324 మంది విద్యార్థులకు గానూ 2,309 మంది విద్యార్థులు తొలిరోజు పరీక్షకు హాజరు కాగా 15 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. నగర పరిధిలోని ఆత్మకూరు నిర్మల ఉన్నత పాఠశాలలో 284 మంది విద్యార్థులకు గానూ 281 మంది విద్యార్థులు, చినకాకాని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 181 మందికి గానూ 181 మంది, యర్రబాలెం డాన్‌బాస్కో ఉన్నత పాఠశాలలో 284 మందికి గానూ 282 మంది, ఎంపీఎల్ ఉన్నత పాఠశాలలో 220 మందికి గానూ 219 మంది, ఆత్మకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 159 మంది విద్యార్థులకు గానూ 158 మంది, అరవింద ఉన్నత పాఠశాలలో 290 మందికి గానూ 289 మంది, సీకే ఉన్నత పాఠశాలలో 285 మందికి గానూ 284 మంది, నూతక్కి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 193 మందికి 189 మంది, పెదవడ్లపూడి ఏటీపీఎం ఉన్నత పాఠశాలలో 138 మందికి గానూ 138 మంది, పెదవడ్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 149 మందికి గానూ 149 మంది, నిడమర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 141 మంది విద్యార్థులకు గానూ 139 మంది విద్యార్థులు తొలిరోజు పరీక్షకు హాజరయ్యారు.

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో రెండు పాఠశాలలు, రూరల్ పరిధిలో మూడు పాఠశాలల్లో మొత్తం 1137 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. దుగ్గిరాల మండలంలో 5 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 714 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 709 మంది హాజరయ్యారని ఎంఈఓ శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 10 కేంద్రాల్లో జరిగిన 10వ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పబ్లిక్ ఎగ్జామినేషన్ అధికారుల సమన్వయంతో రెవెన్యూ, మెడికల్, పోలీస్, ఎలక్ట్రికల్ శాఖల అధికారులు పర్యవేక్షిస్తూ ఆయా శాఖల పరిధిలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు జరిగేటట్లు చూశారని పబ్లిక్ ఎగ్జామినేషన్స్ అధికారులు శ్రీనివాసరావు, సత్యనారాయణమూర్తి తెలియజేశారు. తమ పిల్లలు పరీక్షలు రాస్తుండడంతో తల్లిదండ్రులు సైతం పరీక్షలు జరుగుతున్నంత సేపు పరీక్ష కేంద్రాల గేటు వద్ద వేచి యున్నారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బంది హాల్ టికెట్లను పరిశీలించి విద్యార్థులను పరీక్ష కేంద్రాలలోకి అనుమతించారు.

తాడికొండ..

తాడికొండ: సోమవారం నుంచి ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు తాడికొండ మండలంలో ప్రశాంతంగా కొనసాగాయి. ఏపీ గురుకులం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, పొన్నెకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోతడక శ్రీరామా ఉన్నత పాఠశాలల పరిధిలో మొత్తం 543 మంది విద్యార్థులు పరీక్షలు హాజరుకావాల్సి ఉండగా, ఇందులో పొన్నెకల్లు జిల్లా పరిషత్‌లో నలుగురు, మోతడక శ్రీరామా ఉన్నత పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ తెనాలి ఇందిర తెలిపారు.

కేఎల్‌యూలో మాక్ పార్లమెంట్



మాక్ పార్లమెంట్‌కు వేదికగా మారిన బీఏ ఐఏఎస్ తరగతి గది

తాడేపల్లిరూరల్: భారత పార్లమెంట్ వ్యవహారాల గురించి, ప్రస్తుత రాజకీయాల గురించి విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని కేఎల్ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ విభాగ అధిపతి డాక్టర్ వెంకటేశ్వర కుమార్ అన్నారు. సోమవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఆర్ట్ కళాశాల విద్యార్థులకు మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాజనీతి శాస్త్రంలో ఆయా విభాగాల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ మనది అని అన్నారు. అనంతరం మాక్ పార్లమెంట్‌లో 'రైట్ టు రీకాల్' అనే అంశంపై అధికార పక్ష సభ్యుల మధ్య చర్చ జరిగింది. బీఏ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి జి.ఉదయకుమార్ స్పీకర్‌గా, ప్రధానిగా బీఏ మూడో సంవత్సరం విద్యార్థిని కుమారి తెనాలి అపూర్వ, ప్రతిపక్ష నాయకుడిగా వెంకట నరేంద్ర వ్యవహరించారు. ప్రతిపక్ష పార్టీల చర్చల అనంతరం నూతన రైట్ టు రీకాల్ బిల్లును మాక్ పార్లమెంట్ ఆమోదించింది. భారత పార్లమెంట్‌ను తలపించేలా విద్యార్థులు నిర్వహించిన మాక్ పార్లమెంట్‌ను తిలకించిన విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు అభినందించారు.

చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు



చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మంగళగిరి: నగర పరిధిలోని పలువురు చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తోపుడు బండ్లను అందజేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటా పర్యటించిన సందర్భంలో నగరానికి చెందిన గజం రాజు, బొబ్బా హనుమంతరావు, సుబ్బారావు అనే చిరువ్యాపారులు తమకు తోపుడు బండ్లు కావాలని, రోజుకు రూ.30 నుంచి రూ.50లు చొప్పున అద్దెకు తెచ్చుకుని కూరగాయలు, పండ్లు, ఆకు కూరలు విక్రయించుకుంటున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం నగరంలోని ఆటోనగర్‌లోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం ఎదుట చిరు వ్యాపారులకు వైఎస్సార్ సీపీ నాయకులు తోపుడు బండ్లను అందజేశారు. జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు సంకె సునీత, జిల్లా కార్యదర్శి మల్లవరపు సుధారాణి, నాయకులు ఆకురాతి రాజేష్, ఎండీ ఫిరోజ్, సంకా బాలాజీ గుప్తా, నేరెళ్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

పౌరాణిక, సాంఘిక నాటక కళాకారుడు రత్తయ్యకు సన్మానం



రత్తయ్యను సన్మానిస్తున్న హరిప్రసాద్, రవీంద్ర తదితరులు

తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంత్యుత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం పరువు ప్రతిష్ఠ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం గుడిగంటలు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పౌరాణిక, సాంఘిక నాటక కళాకారుడు అద్దంకి రత్తయ్యను సన్మానించారు. కార్యక్రమంలో తాడిబోయిన హరిప్రసాద్, పినపాటి రవీంద్ర, సోమవరపు సాంబశివరావు, చందు హేమంత్, వినుకొండ శ్రీరామమూర్తి, పెమ్మసాని పోతురాజు, దేవరపల్లి భవానీ, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, గుమ్మడి ప్రసాద్, ఫణీదపు దుర్గ, ముళ్ళపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్, కృష్ణారావు, మధు తదితరులు పాల్గొన్నారు.

పోషకాల గని చిరుధాన్యాలు



తల్లులకు చిరుధాన్యాలతో చేసిన పదార్థాలను అందజేస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ తదితరులు

తాడేపల్లిరూరల్: పోషకాల గని చిరుధాన్యాలు అని దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి అన్నారు. సోమవారం దుగ్గిరాల గ్రామంలో పౌష్టికాహార పక్షోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మల్లేశ్వరి మాట్లాడుతూ చిరుధాన్యాలు నేటితరం వారికి అందజేస్తే భావితరం ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. మహిళలకు చిరుధాన్యాలు, వాటి పోషక విలువలను వివరించారు. కొర్రలు, రాగులు, జొన్నలు తదితర చిరుధాన్యాలు మన నిత్య ఆహారంలో ఉండేలా చూసుకోవాలని అన్నారు. సమతుల ఆహారం పిల్లలకు అందించకపోవడం వల్ల పిల్లలు ఎత్తుకు దగ్గ బరువు లేకుండా బలహీనంగా ఉంటారని అన్నారు. అనంతరం చిరుధాన్యాలతో చేసిన వంటకాలను ప్రదర్శించి పంపిణీ చేశారు. ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి, ఎంపీటీసీ దానబోయిన సంతోష రూపవాణి, జడ్పీటీసీ మేకతోటి అరుణ, దుగ్గిరాల సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికునికి తీవ్ర గాయాలు



కొల్లిపర: తాటి చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారి కింద పడి గీత కార్మికునికి తీవ్రగాయాలైన ఘటన కొల్లిపరలో ఆదివారం సాయంత్రం జరిగింది. కొల్లిపరకు చెందిన బొర్రా నాంచారయ్య(42) రోజూలాగే కల్లుగీయటానికి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తూ జారి చెట్టుపై నుంచి కింద పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే నాంచారయ్యను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరిలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ కూడా సరైన వైద్యం అందక పోవటంతో నాంచారయ్యను మెరుగైన వైద్యం నిమిత్తం ప్రైవేటు వైద్యశాలకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ భీమవరపు పద్మావతి, భీమవరపు సంజీవరెడ్డి , ఎంపీడీవో పి.శ్రీనివాసులు సోమవారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పద్మావతి మాట్లాడుతూ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ దృష్టికి తీసుకువెళ్ళి ప్రభుత్వ పరంగా నాంచారయ్యను ఆదుకుంటామని కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు.

పోషకాహారంతో రక్తహీనత దూరం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంవీ రత్నం



ప్రత్తిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి ఎత్తు, బరువు చూస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

ప్రత్తిపాడు: పోషకాహారంతో రక్త హీనతను అధిగమించవచ్చని ప్రత్తిపాడు సెక్టార్ సూపర్ వైజర్ ఎంవీ రత్నం అన్నారు. పోషణ పక్షోత్సవాలలో భాగంగా సోమవారం ప్రత్తిపాడులోని వడ్డెరపాలెం అంగన్‌వాడీ సెంటరులో ఎంవీ రత్నం ఆధ్వర్యంలో పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. తక్కువ ఖర్చుతో అత్యధిక పోషక విలువలున్న ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవాలి, ఏఏ పదార్థాల్లో పోషక విలువలు ఉంటాయి, ఏ కూరగాయలు, చిరు ధాన్యాల్లో ఎంత మొత్తంలో ప్రొటీన్లు ఉంటాయన్న విషయాలను మహిళలకు వివరించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడారు. రాగులు, సజ్జలు, జొన్నలు, అరికెలు, సాయలు, ఊదలు, కొర్రలు, అండ్రు కొర్రలు, వొరిగెలను ప్రతి నిత్యం తినేందుకు అలవాటు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా సీజనల్ కూరగాయలు, పండ్లను తినడం ద్వారా మరిన్ని విటమిన్లు అందుతాయని వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, అంగన్‌వాడీ కార్యకర్త నాగరాజ కుమారి, తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు గొట్టిపాడు సెక్టార్ పరిధిలోని కొండేపాడులో పోషణ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం సెక్టార్ సూపర్‌వైజర్ అరుణ ఆధ్వర్యంలో జరిగింది. స్థానిక ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో గర్భిణులకు, బాలింతలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రశేఖర్ రెడ్డి, సీహెచ్ఓ విజయ తదితరులు పాల్గొన్నారు.

హెలికాప్టర్ రైడ్, ట్రావెల్ ఇన్సూరెన్స్ పేరిట మోసం

తెనాలిరూరల్: దైవ దర్శనానికి వెళ్ళేందుకు ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకున్న వ్యక్తికి హెలికాప్టర్ రైడ్, ట్రావెల్ ఇన్సూరెన్స్ పేరిట బురిడీ కొట్టించిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన వైద్యుడు నందిపాటి శ్రీకాంత్ జమ్ము కాశ్మీర్‌లోని వైష్ణో దేవి ఆలయానికి వెళ్లేందుకు ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకున్నారు. ఈ ప్రయాణానికి సంబంధించి ట్రావెల్ ఇన్సూరెన్స్ , హెలికాప్టర్ రైడ్ ఏర్పాటు చేస్తామంటూ గుర్తు తెలియని ఫోన్ నంబర్ నుంచి కాల్ వచ్చింది. వారి మాటలు నమ్మి రూ.33వేలు వారి ఖాతాకు శ్రీకాంత్ బదిలీ చేశారు. తిరిగి ఏటువంటి సమాధానం లేక పోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. వన్ టౌన్ పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలతో మానసిక, శారీరక ఉత్సాహం



చెస్ ఆడుతున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: క్రీడలతో మానసిక, శారీరక ఉత్సాహంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఏబీపీ మనోహర్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల మైదానంలో సోమవారం డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మనోహర్ మాట్లాడుతూ క్రీడలపై ఆసక్తిని పెంచుకుని, రాణించడం ద్వారా భావి క్రీడాకారులుగా ఎదిగే అవకాశాలతో పాటు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించవచ్చని తెలిపారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, షటిల్‌తో పాటు చెస్, అథ్లెటిక్స్‌ను మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. అనితాదేవి మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో ప్రావీణ్యత సాధించడం ద్వారా తోటి క్రీడాకారులతో స్నేహపూర్వక సంబంధాల్ని మెరుగుపరచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయా క్రీడలు, ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల క్రీడల కమిటీ అధ్యాపకులు డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, మేజర్ కుమార్ రాజా, డాక్టర్ రవి, చంద్రశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉచితంగా ఓపీ సేవలు

గుంటూరు మెడికల్: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నెల రోజుల పాటు హోప్‌విన్ హాస్పిటల్స్‌లో ఉచితంగా ఓపీ వైద్య సేవలు అందిస్తున్నట్లు చైర్మన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా తెలిపారు. రక్త పరీక్షల్లో సైతం 50 శాతం రాయితీ అందిస్తున్నామని పేర్కొన్నారు. స్థానిక గుంటూరువారితోట 7వ లైనులోని తమ ఆసుపత్రిలో అందిస్తున్న ఉచిత ఓపీ వైద్య సేవల్ని ప్రజలు వినియోగించుకోవాలని హాస్పిటల్ వైస్ చైర్మన్, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్ కోరారు.

మహిళపై లైంగిక దాడి

గుంటూరు ఈస్ట్: స్నేహితురాలిపై లైంగిక దాడి చేసి, అనంతరం హత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణానికి చెందిన మస్తాన్ హైదరాబాద్‌లో ఉండే సమయంలో ఓ యువతితో పరిచయమైంది. అనంతరం గుంటూరు వచ్చాడు. గతనెల 23న హైదరాబాద్‌కు చెందిన మహిళను మస్తాన్ గుంటూరుకు రమ్మని పిలవడంతో వచ్చి, తిరిగి వెళ్లింది. మరలా 28న గుంటూరు వచ్చి మస్తాన్‌ను కలిసింది. ఆమెను అతడు హోటల్‌కు తీసుకెళ్లి లైంగిక దాడి చేసి, హత్యాయత్నానికి యత్నించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

ఏటీఅగ్రహారంలో నివసించే ఓ మహిళ బ్రాడీపేటలోని ఓ అపార్టుమెంటులో ఇంటి పనులు చేసుకుంటుంది. ఇంటికి వెళుతున్న సమయంలో అదే ప్రాంతానికి చెందిన వేల్పుల రమేష్ వెంటపడి వేధించేవాడు. గతనెల 24న రోడ్డుపై అడ్డగించి ఇంట్లో ఎవరూ లేరని, రమ్మని బలవంతం చేశాడు. బాధితురాలు తీవ్రంగా ప్రతిఘటించి ఇంటికి వెళ్లింది. దీనిపై సోమవారం అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వృద్ధురాలిపై వ్యక్తి దాడి

వృద్ధురాలిపై ఇంట్లో పనిచేసే వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యానగర్‌లోని అభిరామ్ రెసిడెన్సీ అపార్టుమెంటులో అక్కినేని వెంకట రమణయ్య, సౌజన్య దంపతులు నివసిస్తున్నారు. వెంకటరమణయ్యకు పక్షవాతం రావడంతో సేవలందించేందుకు నూజివీడుకు చెందిన వెంకటేష్‌ను పనిలో పెట్టుకున్నారు. అతని తీరు నచ్చక ఆదివారం నుంచి పని మానేయాలని చెప్పారు. దీంతో వెంకటేష్ కత్తితో సౌజన్యపై దాడి చేసి మెడ, చేతులమీద గాయపరిచాడు. సౌజన్య ప్రతిఘటించి కేకలు వేయడంతో పరారయ్యాడు. స్థానికులు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

ముగిసిన కోదండ రాముని ఉత్సవాలు

పాత గుంటూరు: కొరిటెపాడు గాంధీ బొమ్మ సెంటర్‌లోని శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామనవమి మహోత్సవాలు సోమవారం వైభవంగా ముగిశాయి. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, మూలవిరాట్‌కు విశేషంగా పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ, అర్చన తదితర కార్యక్రమాల్ని వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. స్వామివారి పూజల్లో ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్, భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ, చుక్కపల్లి రమేష్ పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయంత్రం స్వామి పవళింపుసేవ భక్తిప్రపత్తులతో నిర్వహించారు.

పలు కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత

తాడేపల్లిరూరల్: దుగ్గిరాలలోని పలువురు బాధితులకు ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఎమ్మెల్యే ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని సోమ బాధిత కుటుంబాలకు దుగ్గిరాల ఎంపీపీదానబోయిన సంతోష రూపవాణి, జడ్పీటీసీ మేకతోటి అరుణ, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్)లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని గ్రామం, ఎస్సీ కాలనీకి చెందిన కనపాల పాములు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఇటీవల మృతి చెందగా, ఆ కుటుంబానికి సానుభూతిని ప్రకటించి, రూ.15వేలు, వల్లూరు రవికుమార్ కుటుంబానికి మరో రూ.15 వేలు, పులివర్తి రామయ్య కుటుంబానికి రూ.15 వేలు, పక్షవాత బాధితుడు పెండ్యాల యాకోబు కుటుంబానికి రూ.15 వేలు, క్యాన్సర్ బాధితురాలు చొప్పర కుమారికి రూ.10 వేలు, మరో క్యాన్సర్ బాధితురాలు చొప్పర రత్నకుమారికి రూ.15 వేలు, మొత్తం రూ. 85 వేలను అందజేశారు.

వినాయక గుడిలో అన్నదానం



తెనాలిటౌన్: స్థానిక గాంధీనగర్‌లోని రామమందిరంలో వసంత వనరాత్రి మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. రామమందిరంలో 48వ సంవత్సరం సీతారామ కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఉత్సవాలు ముగింపు సందర్భంగా వినాయకగుడి ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. రామ మందిరం నిర్వాహకులు కన్నెగంటి గోపిచంద్, మాణిక్యాలరావు, కంచి రాంబాబు, దంతాల ఆంజనేయులు, తోట భానుమూర్తి, పొన్నం విజయకుమార్, కన్నెగంటి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

9న రసధ్వని పుస్తకావిష్కరణ

తెనాలి: కళాతపస్వి సంజీవదేవ్ సాహిత్యం–జీవితంపై తాజాగా వెలువరించిన 'రసధ్వని' పుస్తకాన్ని ఈనెల 9న తెనాలిలో ఆవిష్కరించనున్నారు. ఈ పుస్తకాన్ని ప్రఖ్యాత రచయిత శ్రీరమణ, ఎన్ఆర్ తపస్వి, వెనిగళ్ల వెంకటరత్నం సంకలనం చేశారు. డాక్టర్ సంజీవదేవ్ ఫౌండేషన్, తెనాలి ఆధ్వర్యంలో, ఆరోజు సాయంత్రం 4.30 గంటలకు స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో జరిగే సభకు ప్రజాసాహితి ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు అధ్యక్షత వహిస్తారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ముఖ్యఅతిథిగా వస్తారని, చైతన్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, ప్రముఖ రచయిత ముత్తేవి రవీంద్రనాథ్ వక్తలుగా వ్యవహరిస్తారని ఫౌండేషన్ కార్యదర్శి వైవీ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పత్రాలు లేని వాహనాలకు జరిమానా



తెనాలిరూరల్: తెనాలి–గుంటూరు వయా నారాకోడూరులోని క్వారీల వద్ద రవాణా శాఖ అధికారులు ప్రత్యేక వాహన తనిఖీలను సోమవారం సాయంత్రం చేపట్టారు. తెనాలి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ తోట రాఘవరావు, సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 16 మంది ద్విచక్రవాహనదారుల వద్ద సరైన పత్రాలు లేనట్లు గుర్తించి సుమారు రూ.90 వేల వరకు జరిమానాలు విధించారు. వాహనదారులు సీ బుక్ లైసెన్సుతోపాటు తప్పనిసరిగా ఇన్సూరెన్స్, పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని రాఘవరావు సూచించారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ

కొల్లిపర: స్థానిక పాలకేంద్రం కల్యాణ మండపంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కొల్లిపర, చివలూరు, అన్నవరం, అన్నవరపులంక, బొమ్మువానిపాలెం, చక్రాయపాలెం, చెముడుబాడు, హన్‌మాన్‌పాలెం, సిరిపురం, తూములూరు, దావులూరు, దావులూరిపాలెం గ్రామాల్లోని పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత మెగా చెక్కు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో పి.శ్రీనివాసులు ఓ ప్రకటన విడుదల చేశారు.కార్యక్రమానికి ఆయా గ్రామాలల్లోని లబ్దిదారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఉదయం 10గంటలకు హాజరుకావాలని కోరారు.